క్లుప్తంగా

ప్రభుత్వం ఆమోదం రాగానే పనులు పూర్తి చేస్తాం

చాపాడు : రాజోలి జలాశయం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం రాగానే పనులు పూర్తి చేస్తామని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ తెలుగుగంగ పథకం ఈఈ శివశంకర్‌రెడ్డి తెలిపారు. నిర్మాణం పూర్తిచేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత రెడ్యంవెంకటసుబ్బారెడ్డి ఈ నెల 11న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో ఈఈ స్పందిస్తూ వివరాలతో రెడ్యంకు లేఖ పంపారు. అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టి పూర్తి చేస్తామని లేఖలో పేర్కొన్నారు. రెడ్యం మాట్లాడుతూ రాజోలు రిజర్వాయర్ పూర్తయితే రెండు పంటలు పండించుకోవచ్చన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ప్రముఖులు

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల ఆమె భర్తతో కలిసి మంగళవారం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వారివెంట ఎల్లటూరి శివారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి ఆత్మకూరు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు ముస్లింలతో కలసి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేయొద్దు

మైదుకూరు: మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయవద్దని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ పేర్కొన్నారు. ఎంఈఓలు పద్మలత, నరహరి శర్మలను మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్స్‌పై విద్యా కమిటీల ద్వారా (ఎస్ఎంసీ) ప్రభుత్వానికి అనుకూలంగా తీర్మానాలు తీసుకురావాలని, అలా చేయని పక్షంలో కలెక్టర్ ఛాంబర్‌కు వెళ్లి రెండు పేజీల వివరణ ఇచ్చుకోవాల్సి వస్తుందని ఎంఈఓ పద్మలత అనడం ఉపాధ్యాయులను భయపెట్టడమే అన్నారు. ఈ కార్యక్రమంలో జి.మల్లేశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, బీకే.సురేష్, ఎం.మునెయ్య, మీర్‌సాబ్ పాల్గొన్నారు.

యాలివాహనంపై శ్రీనివాసుడు



వేంకటేశ్వరస్వామి

బద్వేల్ అర్బన్: మండలంలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజున మంగళవారం స్వామి యాలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్ పాల్గొన్నారు.

యంత్రంతో కోత.. మరింత సులువు

యంత్రాలతో పనులు చేయడంతో రైతన్నలకు వ్యవసాయం మరింత సులువు అవుతోంది. రైతులు సాగు చేసిన నువ్వు పంట గత కొన్నేళ్లుగా కూలీలతో కోత కోయించారు. అయితే కూలీల కొరత రావడం, అధికంగా డబ్బు చెల్లించి పనులు చేయించుకోవడం వారికి భారంగా మారింది. ఈ క్రమంలో నువ్వు పంట కోత కోసే యంత్రం రావడంతో రైతులు అటువైపు మొగ్గు చూపారు. గంటకు రూ.2800 చెల్లించి కోత కోయిస్తున్నట్లు రైతన్నలు తెలిపారు. కోసిన పంటను ఓ చోట వేయడంతో సమయం కూడా ఆదా అవుతోంది. – రాజుపాళెం



రాజుపాళెంలో నువ్వు పంట కోత కోస్తున్న యంత్రం



కోత కోసిన పంటను పట్టల్లోకి వేస్తున్న దృశ్యం



కుప్పగా వేసిన నువ్వు కట్టె

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్ వలి

ప్రొద్దుటూరు : సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మిల్లెట్స్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం.. ఒక్క మార్పుతో నూరేళ్ల ఆరోగ్యం అంశంపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఖాదర్‌వలి మాట్లాడుతూ చాలామంది వంట మరచిపోయారని, ఇంట్లో వండడం మానేసి జొమాటో, స్విగ్గీద్వారా మాంసాహార బిర్యానీ, ఫాస్ట్ ఫుడ్, పిజ్జా, బర్గర్ తింటూ రోగాల బారిన పడుతున్నారన్నారు. ఏ సిరి ధాన్యం తినాలి.. కషాయాలు ఎలా తయారుచేయాలి వివరించారు. అనంతరం ఖాదర్ వలిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.హుస్సేన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు, పి.కిశోర్‌చంద్ర, కె.లావణ్యకుమారి, డాక్టర్ ఎంవీవీ.ప్రసాద్, రజనీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతు మృతిపై త్రిసభ్య కమిటీ విచారణ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

బ్రహ్మంగారిమఠం: మండలంలోని చౌదరివారిపల్లె ఎస్సీ కాలనీలో కౌలు రైతు ప్రవీణ్‌కుమార్(33)మృతిపై కలెక్టర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం విచారించారు. బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, పోరుమామిళ్ల వ్యవసాయ విస్తరణాధికారి మురళీధర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులను కలిసి మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య అనిత అధికారులతో మాట్లాడుతూ రైతుల వద్ద రెండు ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని తన భర్త వ్యవసాయం చేసేవారన్నారు. పంట నష్టపోవడంతో అప్పులకు అధిక వడ్డీ కట్టలేక చేను దగ్గరే పురుగుమందు తాగి చనిపోయాడని విలపించారు. ఇద్దరు చిన్న ఆడపిల్లలతో పూట గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కుమార్ తండ్రి దేవరాజు మాట్లాడుతూ . ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ విచారణ పూర్తి వివరాలు కలెక్టర్‌కు పంపుతామన్నారు. డీటీ జాన్స్, ఏవో ప్రవీణ్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల విలీన ప్రక్రియ నిలిపివేయండి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

పోరుమామిళ్ల : రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల విలీన ప్రక్రియ విరమించుకోకపోతే ఉద్యమిస్తామని మండల ఫ్యాప్టో నాయకులు శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, చంద్రహాసరెడ్డి, పుల్లారెడ్డి పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి బాలఅంకిరెడ్డిని మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఉపాధ్యాయుల ఆమోదంతో విద్యావ్యవస్థలో మార్పులు తీసుకు రావాలని, సొంత నిర్ణయంతో విలీన ప్రక్రియ ఆరంభిస్తే పేదలు విద్యకు దూరమవుతారని అన్నారు. 50 మంది విద్యార్థులున్న ప్రతి పాఠశాలను మోడల్ పాఠశాలగా మార్చి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రాంభూపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, ప్రవీణ్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, గురయ్య, అబ్దుల్‌సలాం పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం



బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కొవ్వూరు రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : అవయవదానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కొవ్వూరు గ్రాండ్ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తనకు కాలేయ మార్పిడి జరిగి 23 ఏళ్లు అయిన సందర్భంగా 250 మంది రోగులకు మంగళవారం బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో తనకు కాలేయం సమస్య రావడంతో స్వప్న అనే యువతి అవయవదానం చేసిందన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మహిళలకు కుట్టుశిక్షణ, 800 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ, విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అవయవమార్పిడి అవసరమైన వారికి తన వంతు సహకారంగా రూ.50 వేలు అందిస్తానన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజలను చైతన్య పరుస్తున్న కొవ్వూరు రమేష్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ డాక్టర్ గోపాల్, కొవ్వూరు చైతన్యరెడ్డి, నటకల సతీష్, నారాయణ, ఆరవేటి సుబ్బయ్య, రొటేరియన్ రామకృష్ణ, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కొంగుబంగారం అంకాలమ్మ



మున్నెల్లిలోని అంకాలమ్మ మూలవిరాట్

బి.కోడూరు : కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మున్నెల్లిలో వెలసిన అంకాలమ్మ బ్రహ్మోత్సవాలను ఈ నెల 12వతేదీ నుంచి 17వతేదీ వరకు వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 12న అమ్మ వారికి ఆకుపూజ, 13న ధ్వజారోహణం, 14న కలశ స్థాపన, చలిబిండి నానుబాలు కార్యక్రమం, 15న మున్నెల్లి, బోడుగుండుపల్లె గ్రామాలకు చెందిన సుడిబండ్లు, బి.మఠం మండలం కేశాపురం గ్రామానికి చెందిన కుంకుమబండ్లు, వెంకటాపురం గ్రామానికి చెందిన నగదాబండ్ల ప్రదర్శన ఉంటుంది. అదే రోజున మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఆలయానికి బద్వేల్, పోరుమామిళ్ల కొత్త రోడ్డు నుంచి రెడ్డివారిపల్లె మీదుగా చేరుకోవచ్చు.

అన్ని ఏర్పాట్లు చేశాం

ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అంకాలమ్మ బ్రహ్మోత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. బ్రహ్మోత్సవాల సందర్భంగా బి.కోడూరు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. – ఓబుల్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త, మున్నెల్లి

పాఠశాలలో విచారణ

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద సోమవారం రాత్రి విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయంపై సమగ్రశిక్ష జిల్లా అధికారి నిత్యానందరాజు మంగళవారం విచారణ చేపట్టారు. ముందుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరిగితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జీసీడీఓ అనిత, ఎస్ఏఎంఓ కల్పన, డీఏఎంఓలు వీరేంద్ర, విజయభాస్కర్, ఎంఈఓ-2 మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కారకులనుశిక్షించాలి

పోరుమామిళ్ల : కలసపాడు మండలం పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థిని భార్గవి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్ కేశవ, సునీల్ కోరారు. వారు మాట్లాడుతూ బాలికపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

విచారణ జరిపి న్యాయం చేయాలి

కలసపాడు : విద్యార్థిని భార్గవి ఆత్మహత్యాయత్నానికి కారణాలపై వాచిరంచి వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు అభిలాష్, చంద్ర, రమణ, కార్తిక్ సమగ్రశిక్ష జిల్లా అధికారి నిత్యానందరాజును కోరారు. పాఠశాలకు వారు మంగళవారం వెళ్లి విద్యార్థులు, టీచర్లతో జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

అయ్యప్ప ఆలయ కమిటీ

ఖాజీపేట: ఖాజీపేట అయ్యప్పస్వామి ఆలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పత్తి వెంకట కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోక్షగుండం ఆచారి, కోశాధికారిగా మునగాని శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఉండేలు వీరరాఘవరెడ్డి, సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుంకు సత్యనారాయణ, ఉప కోశాధికారిగా తులసీ ఈశ్వర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. పత్తి వెంకటకృష్ణారెడ్డిని కమిటీ సభ్యులు సత్కరించారు.

పన్ను చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

చాపాడు : మండలంలోని అన్ని గ్రామాలలో పన్నులను సకాలంలో చెల్లించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు వద్ద సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో పన్ను వసూలుపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కళాశాల నుంచి రూ.28 లక్షల పనున బకాయి ఉందని, త్వరగా చెల్లించాలని కోరారు. పన్ను చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే నకిలీ వస్తువులపై అవగాహన



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న రఘురామయ్య


ప్రొద్దుటూరు రూరల్ : పాఠశాల స్థాయి నుంచే నకిలీ వస్తువులపై విద్యార్థులకు ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని ప్రధానోపాధ్యాయుడు రఘురామయ్య అన్నారు. మండలంలోని తాళ్లమాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) స్టాండర్డ్స్ క్లబ్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అంకాల్ కొండయ్య, రమణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయండి

మైదుకూరు : వినియోదగారులకు అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల్లోని క్షేత్ర స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ఎస్ఈ మాట్లాడుతూ వేసవిలో సాధారణ రోజుల కంటే విద్యుత్తు సరఫరాపై ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. బకాయిల వసూళ్లలో రాజీ పడవద్దన్నారు. లోఓల్టేజి సమస్య తలెత్తకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మైదుకూరు ఈఈ భరణి కృష్ణ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఖాజీపేట: విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ సిబ్బందికి సూచించారు. ఖాజీపేట సబ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. టౌన్‌లో విద్యుత్ లైన్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించాలని సూచించారు. వాలి పోయిన స్తంబాల స్థానంలో తీగలకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఈఈ భరణీకృష్ణ, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కాల్వ పూడ్చివేతకు అడ్డుకట్ట



కాల్వ మట్టిని చదును చేశారిలా..

చాపాడు : మండలంలోని పల్లవోలు, ఖాదర్‌పల్లె చెరువుల నుంచి కింది ప్రాంతాలకు నీరందించే కాల్వకు కొందరు పూడ్చివేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. పల్లవోలు, ఖాదర్‌పల్లె చెరువుల కింద మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారి ప్రక్కన సర్వే నెంబర్215లో భూమిరెడ్డి లక్ష్మీదేవితో పేరుతో చెరువు కాలువ ఉంది. ఆమె భర్త రామోహన్‌రెడ్డి సోమవారం జేసీబీతో మట్టిని కాల్వలో వేయించాడు. రెండు టిప్పర్లతో బండ రాళ్లను తోలించారు. వీఆర్‌ఓ ఇస్మాయిల్, వీఆర్ఏలు చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వీఆర్‌ఓ తెలిపారు.

కూటమి ప్రభుత్వ తీరును ఎండగడదాం



బద్వేల్‌లో యువత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు



కలసపాడులో పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : విద్యార్థులకు సకాలంలో ఫీజు రీఅంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ తీరును ఎండగడదామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ, అట్లూరు మండల అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కడపలో నిర్వహించనున్న యువత పోరు గోడ పత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేనిపక్షంలో ప్రతి నెల నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చి కూటమి నాయకులు దగా చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, పి.బ్రహ్మానందరెడ్డి, రమేష్‌బాబు, కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, మౌలాలి, షఫీ, రెడ్డెయ్య, సుబ్బరాజ, రజనీకాంత్, బాబు, సుబ్బారెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు కడపలో యువత పోరు



మాట్లాడుతున్న రాచమల్లు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు బుధవారం కడప కలెక్టరేట్ వద్ద తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా బుధవారం ఉదయం 8 గంటలకు ప్రొద్దుటూరు కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తామని, అల్పాహారం అనంతరం కార్యకర్తలతో కలిసి కడపకు తరలి వెళ్తామని పేర్కొన్నారు.

యువకులంతా తరలిరండి

అట్లూరు : యువత పోరు కార్యక్రమానికి యువకులంతా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. అట్లూరులో కడపలో జరిగే యువత పోరు పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాన్నవోలు బ్రహ్మానందరెడ్డి, ముడమాల గోవర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అట్లూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వంపై పోరు

కలసపాడు : కూటమి ప్రభుత్వం పేవ పిల్లలపై కక్ష సాధింపు చర్యలు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సుధారామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం యువత పోరు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు కట్టకపోవడంతో విద్యార్థులను వెల్లగొడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, పులిపీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, మస్తాన్‌వలి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.